**దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ!**

హాల్లో కూర్చుని ఊలు అల్లుకుంటున్న ఇందుమతి మనసు పరధ్యానంగా వుంది. చేతులు యాంత్రికంగా తమ పని చేస్తున్నా మనసు కొన్ని వందల మైళ్ళదూరంలో వుంది. ఆమె చూపు కూడా ఎక్కడో సుదీర తీరాలలో చిక్కుబడిన దానిలా వుంది. చుట్టూ మనుమ్యులు వుండి అష్ట ఐశ్వర్యాలు వున్నా మానసిక ఒంటరితనం చాలా భయంకరమైనది. రాత్రినుండి తన మనసు మనసులో లేదు. శ్రీరామ్ గురించి ఆలోచనే! అది ఇవాళ కొత్తగా వచ్చిన ఆలోచన కాకపోయినా నిన్నటినుండి అతడు మరీ మరీ గుర్తుకు వస్తున్నాడు. అక్కడ ఏం చేస్తున్నారో... ఎలా వున్నారో... అతడి గూర్చే ఆలోచిస్తున్న తనకు కలలో శ్రీరామ్ తన పక్కనే వున్నట్లు, ప్రేమగా తన ముంగురులు సవరిస్తూ "ఇందూ" అని పిలుస్తున్నట్లు... ఎప్పుడో పెళ్ళయిన కొత్తలోలా తను అతని ఎదమీద నిశ్చింతగా వున్నట్లు అస్పష్టమైన భ్రాంతి. ఎన్నేళ్ళ కిందటి విషయం అది!

అతడు దూరమై దాదాపు పదేళ్లైంది. అతడు ఒక డబ్బు సంపాదించే యంత్రంగా మారాడేకానీ అలాంటి అనుభూతులకు చోటేది? ఎన్నో వేల మైళ్ళదూరంలో 'లిబియా'లో అతను. ఇక్కడ హైదరాబాద్‌లో పిల్లలతో తను. సంవత్సరానికో రెండేళ్ళకో వస్తాడు. పదిహేను రోజులో, నెలరోజులో వుంటాడు. అతడు వున్న రోజులు క్షణాల్లా దొర్లిపోతాయి. తన జీవితంలో వసంతం వచ్చినట్లు వుంటుంది. ఆ తర్వాత మళ్ళీ మామూలే! భయంకరమయిన నీరవ నిశబ్ద వంటరితనం. దేనికోసం? కేవలం డబ్బు... అది ఇచ్చే సుఖాలు విలాసాలు వదులు కోలేక... ఇలా పదేళ్ళబట్టీ జరుగుతోంది. ఇందుమతి కళ్ళు తడిగా, భారంగా అయ్యాయి.

డ్రాయింగ్ రూమ్‌లో కోలాహలం. పద్దెనిమిదేళ్ళ సుష్మ తన ఫ్రెండ్స్‌తో వీడియోలో ఇంగ్లీమ కేసెట్ వేసుకుని ఎంజాయ్ చేస్తోంది. బాబ్డ్ హెయిర్... ఖరీదయిన వేషం. ఆమె చుట్టూ వున్న స్నేహితురాళ్ళు కూడా చుడీదార్ డ్రెస్సులు వేసుకుని ఖరీదయిన అలంకరణలో వున్నారు. 'రాంబో' సినిమాను ఎగ్జయిటింగ్‌గా చూస్తున్నారు వాళ్ళంతా!

వాళ్ళంతా నేటి యువతరానికి ప్రతినిధులు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న హైసొసైటీ అమ్మాయిలు.

"ఎల్లుండి అనిత పెళ్ళికదా! అందరూ ఏమి ఆలోచించారు. ఏ డ్రెస్ వేసుకుంటే బాగుంటుంది. మన ఫ్రెండ్స్ గ్రూప్ పెళ్ళిలో ప్రత్యేకంగా కనిపించాలి" అంది సుష్మ.

"ఓ.కే... యార్... నేను చందేరి చీర. ముత్యాల సెట్..." అంది రేఖ.

నేను కంచిపట్టు చీర... ఎమరాల్డ్‌సెట్... మరి నువ్వు సుష్మా..."

"నేను వైట్ బనారస్... రవ్వల సెట్..." అంది సుష్మ.

అందరూ ఈర్ష్యగా చూసారు." నీకేమోయ్... మీ డాడీ సంవత్సరానికి కొన్ని లక్షలు సంపాదిస్తాడు. డైమండ్ సెట్ కొంటావు. ఇంకేమయినా కొంటావు..." అంది ఒక అమ్మాయి.

"మీరు మాత్రం తక్కువ ఏమిటే?... మీ డాడీని, మమ్మీని అడగండి. నన్నడిగితే పెళ్ళికి ముందే అన్నీ అడిగి చేయించుకోవాలి. అడగందే మమ్మీ డాడీ మాత్రం చేయిస్తారేమిటి? నాకయితే మాడాడీ అన్నీ కొనిపెట్టారు. మీరూ ఇప్పటినుండే ఇంటికి కావలసినవన్నీ మీ మమ్మీని డాడీని అడిగి కొనిపించుకోండి..." అంది సుష్మ.

"అదెలా కుదురుతుంది?... అన్నయ్యలు వుంటారుగా... అంతా మనకే ఇచ్చేస్తే మగపిల్లలకు ఆస్తిపెట్టాలిగా అంటారు మా డాడీ" అంది రేఖ.

"ఓహ్... అవన్నీ పాతకాలం మాటలే... మగపిల్లలతో పాటు మనకూ ఆస్తిలో సమానహక్కువుందిగా... అన్నీ కొనుక్కుని వుంటే మంచిది. అంతేకాదు. అన్ని వస్తువులతో గ్రాండ్‌గా మొగుడి దగ్గరకు వెళితేనే బాగుంటుంది. కట్నం, ఆస్తి ఏమీలేకుండా వెళితే వాడు గౌరవించవద్దూ..." ఈ తరం స్త్రీ జాతి ప్రతినిధిలా మాట్లాడుతున్న సుష్మ మాటలు, గదిలో జరుగుతున్న సంభాషణ వింటున్న ఇందుమతికి మతిపోయినట్లయింది. వీరేనా తమ మూడవతరం... వీరికోసమేనా తమ తరం స్త్రీలంతా కలవరించి అన్ని కష్టాలకు ఓర్చింది. తమ ముందుతరం స్త్రీలంతా అత్త, భర్తగారి తరఫు బంధువుల వలన కష్టాలపాలవుతున్నారని గోల పెట్టి, స్త్రీ స్వాతంత్ర్యం కావాలని నినాదాలు చేసి ప్రతి స్త్రీ చదువు సెపంతో వెలుగులోకి వచ్చి మారే ఆర్థిక, సామాజిక పరిస్థితులననుసరించి ఒకరిద్దరు పిల్లలతో 'బర్త్ కంట్రోల్' చేసుకుని... కష్టపడి ఆస్తి చేరవేస్తే... తమ ద్వారా పుట్టిన ఈ మూడవ తరం ఇలా ఎందుకు తయారవుతున్నారు? ఆప్యాయతలు మాయమయి వాటి స్థానే కృత్రిమత్వం... యాంత్రికత... తమ తరంలో అన్న చెల్లి, తల్లి, తండ్రి ఎంత అనుబంధం, ఎంత శాంతి... ఒకరికోసం ఒకరు చేసుకునే ఆ చిన్న చిన్న త్యాగాలలో ఎంత ఆత్మ సంతృప్తి. మనసు పదిహేనేళ్ళ వెనకకు వెళ్ళింది.

* * *

ఇందుమతి మామూలు మధ్య తరగతి కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లల మధ్య పుట్టింది. అక్కల పెళ్ళిళ్ళు అయ్యాక ఇందుమతి డిగ్రీ చదువుతుండగా ప్రయివేటు కంపెనీలో ఇంజనీరుగా పనిచేసే శ్రీరామ్‌తో పెళ్ళయింది. అప్పటి రోజుల్లో ఇప్పటిలా డబ్బుకు కాక కుటుంబ మర్యాదలకు సంప్రదాయాలకు ఎక్కువ విలువ ఇచ్చేవారు. ఎక్కువ కట్నం లేక మూడు తులాల బంగారంతో శ్రీరామ్ భార్య అయింది ఇందుమతి. ఇప్పటిలా టి.వి, ఫ్రిజ్, ఫర్నీచర్ లాంటి లాంఛనాలు అసలు తెలియవు.

సిటీలో కాపురం పెట్టిన కొత్తలో ఎంతో ఆనందంగా గడిపేవాళ్ళు. ఎక్కువ ఆడంబరాలకు పోక ఉన్నంతలోనే సర్దుకుని చెల్లెలు పెళ్ళికి, కుటుంబానికి ఎంతో సాయంచేశాడు శ్రీరామ్. సుష్మ, శ్రీనివాస్ పుట్టారు. చాలనుకున్నారు. సంవత్సరాలు గడిచేకొలదీ డబ్బువిలువ తగ్గిపోయి చుట్టూవున్న ప్రపంచం విపరీతంగా మారిపోయింది. శ్రీరామ్‌కు వచ్చే జీతంలో ఇద్దరు పిల్లలతో సిటీలో బ్రతకడం కష్టమయిపోయింది. ఇరుగు పొరుగు ఇళ్ళల్లోని వస్తువులు చూసి కావాలని పిల్లలు పేచీ పెట్టేవాళ్ళు. ఇందుమతి ఎంత సర్దుకున్నా శ్రీరామ్ సర్దుకోలేకపోయాడు. అందుకే 'లిబియా'లో ఇంజనీర్లు కావాలనే ప్రకటన చూసి అప్లై చేశాడు. నెలకు పది, పదిహేను వేలవరకు జీతం ఇస్తామన్నారు. అక్కడి



కంపెనీవాళ్ళు. లిబియాకు రెండేళ్ళకాంట్రాక్ట్ పద్ధతిలో వెళ్ళాలనుకున్నాడు. అతడు వెళుతున్నాడంటే ఇందుమతి మనసులో గుబులు చోటు చేసుకుంది..

"దూరపు కొండలు నునుపు... అన్నట్లు మనకు ఈ డబ్బు మీద వ్యామోహం ఎందుకండి..." అంది తను.

"ఇందూ... నువ్వు ఒక్కదానివి ఇలా అన్నంత మాత్రాన సరిపోదు. చుట్టూవున్న ప్రపంచాన్ని చూస్తున్నావు కదా! డబ్బుకు ఎంత విలువ వుందో... నేను వెళ్ళేది నీకోసం, పిల్లలకోసమే" అన్నాడు, శ్రీరామ్.



# గడ్డిపువ్వులో మేలు

— పి.శైలజ

"మిమ్మల్ని వదిలి రెండేళ్ళు వుండలేనండి..." బేలగా అంది. అతడిని చిన్న పిల్లలా అల్లుకుపోతూ.

అతడి మనసుకి అర్థమయింది. తనకు మాత్రం భార్యా పిల్లలకు దూరంగా వుండాలని వుందా? కానీ అర్థికావసరం! "రెండేళ్ళంటే ఎంతలోవస్తాయి ఇందూ... ఈ రెండేళ్ళు కష్టపడితే రెండు, మూడు లక్షలు వెనకేసు కోవచ్చు. సుష్మ పెళ్ళి తేలికగా చెయ్యెచ్చు..." అనునయంగా అన్నాడు.

ఇందుమతి కళ్ళముందు రంగులకల. రెండేళ్ళలో డబ్బు సంపాదించి తను, భర్త పిల్లలు సంతోషంగా వున్నట్టు... ఆ సంతోషం ముందు రెండేళ్ళ వియోగం ఎంత సేపు? అనుకుంది.

అతడు లిబియా వెళ్ళిపోయాడు. నెలలు గడుస్తున్న కొలది బేంక్ బేలన్స్ పెరిగినా మానసికంగా వంటరిదై పోయింది. పిల్లలు స్కూళ్ళకు వెళతారు. వయసులో వంటరిగా వున్న స్త్రీ. వదంతులకు అవకాశం ఇవ్వక మిషనరీ స్కూల్లో టీచర్‌గా చేరింది. రెండేళ్ళు గడిచాయి. శ్రీరామ్ తిరిగి వస్తూ టి.వి, వి.సి.ఆర్ లాంటి వస్తువులు తెచ్చాడు. అలాగే మరో మూడేళ్ళు అక్కడ పని చెయ్యడానికి కాంట్రాక్ట్ రాసి ఇచ్చాడు.

ఇందుమతి బాధపడింది. ఏడ్చింది. ఇందుమతి బాధ చూడలేక భార్యా పిల్లలను కూడా తీసుకెళ్ళాడు శ్రీరామ్. అక్కడ రెండేళ్ళకు మించి వుండలేకపోయారు. పిల్లల చదువులు అక్కడ సరిగ్గా సాగవని ఇందుమతి, పిల్లలు ఇండియాకు వచ్చేశారు. శ్రీరామ్ అక్కడే వుండి పోయాడు. శ్రీరామ్ తల్లిని తోడుకోసం తన దగ్గరే ఉంచుకుంది ఇందుమతి.

సొంత ఫ్లాట్ కొన్నారు. సుష్మపేరుతో ఇంకో ఫ్లాట్ తీసారు. కారు, నగలు, బేంక్ బేలన్స్ ఒక్కొక్క అవసరానికి ఒక్కొక్క సంవత్సరంచొప్పున పొడిగిస్తూ అక్కడే వుండి పోయాడు. శ్రీరామ్ అక్కడికి వెళ్ళి పదేళ్ళు అవుతూంది.

ఇందుమతికి నలభైఏళ్ళు వస్తున్నాయి. శ్రీరామ్ తల్లి చనిపోయింది. ఇందుమతి వంటరిది అయిపోయింది. సంవత్సరానికి ఒకసారి అతడు వచ్చినపుడు ఆమెకు జీవం వస్తుంది. తండ్రి లేకపోవడంతో పిల్లలు ఇందుమతి మాట వినరు. ఇంటర్మీడియట్ కొచ్చేసరికే అన్ని అలవాట్లు శ్రీనివాస్‌కి అలవడ్డాయి. శ్రీనివాస్ ఫ్రెండ్స్ అంతా లక్షాధికారులు, రాజకీయనాయకుల కొడుకులు బాగా డబ్బు పలుకుబడి వున్నవాళ్లే! దాని వలన డబ్బు విలువ తెలియదు. విచ్చలవిడిగా ఖర్చుచేస్తాడు. తాగుడు లాంటివయితే ఫరవాలేదు. డ్రగ్స్‌లాంటివి ఎక్కడ అలవాటు చేసుకుంటాడో అని ఇందుమతి భయం. తాము వయసులో కోరికలు, సరదాలు చంపుకుని దూరంగా వుండి లక్షలు సంపాదించినందు వలన లాభమో నష్టమో ఇంకా అర్థంకాలేదు ఇందుమతికి. సంఘంలో స్టేటస్ వచ్చింది కానీ కోల్పోయిన జీవితం తిరిగి వస్తుందా?

* * *

ఇందుమతి ఎదురుచూసిన రోజు వచ్చింది. శ్రీరామ్ ఇండియాకు వచ్చేశాడు. ఎయిర్‌పోర్ట్‌లో భార్యా పిల్లలను చూసుకున్న అతనిలో అనిర్వచనీయమైన సంతోషం. తన బరువు తీరిపోయినట్లు అతడిని చూడగానే ఇందుమతి కళ్ళలోనూ అదేభావం. అతడు వచ్చిన పది, పదిహేను రోజులవరకూ పార్టీలు, స్నేహితులు, బంధువుల హడావిడితో గడిచిపోయింది.

ఆ రోజు రాత్రి తీరికగా కుటుంబ పరిస్థితి వర్ణించి చెప్పసాగింది. ఇందుమతి చెప్పడమే కాదు. శ్రీరామ్ కూడా పిల్లల పరిస్థితి గమనిస్తున్నాడు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చుచేయడం, నిర్లక్ష్యం, బాధ్యతారహితమయిన ప్రవర్తన చూసి బాధ పడ్డాడు. తాను అన్నేళ్ళు దూరంగా వున్నందుకా వాళ్ళు అలా తయారయ్యారు?

ఆర్థికపరిస్థితి చూసుకుంటే సుష్మ పెళ్ళి కోసం కొన్న ఫ్లాటు, సుష్మ పెళ్ళి ఖర్చులకు దాచిన డబ్బు మినహాయిస్తే... మిగిలిన డబ్బు బేంక్‌లో వేస్తే వచ్చే వడ్డీతో ఇల్లు గడవదు. కానీ అప్పటికే శ్రీరామ్ తన ఫ్రెండ్ కంపెనీలో మూడువేల రూపాయల జీతానికి అతని దగ్గర పనిచెయ్యడానికి అంగీకరించాడు. ఇక మీదట కాస్త పొదుపుగా గడుపుకోవాలి. అతనికే ఆశ్చర్యంగా వుంది. ఒకరకమైన జీవితానికి అలవాటు పడిపోయి... ఇన్ని రోజులు ఎంతో వుంది అనే భ్రమలో గడిపారు. కానీ గుప్పెట తెరిస్తే అసలు గుట్టు బయట పడింది అన్నట్లుగా అయింది.

అతడి మనసు గ్రహించిన ఇందుమతి 'మరేం ఫరవాలేదు. మీరు దగ్గరుంటే చాలు. ఉన్నంతలో సర్దుకోవచ్చు...'' అతని ఎదమీద నిశ్చింతగా వాలుతూ అంది.

కష్టంలో, సుఖంలో తన సాన్నిధ్యంకోరే అర్ధాంగిని చూస్తూంటే అతనిలో ప్రేమ వెల్లువలా ఉబికింది. ''ఈ డబ్బుకోసం ఇన్నేళ్ళూ నిన్ను దూరం చేసుకున్న దురదృష్టవంతుడిని'' అనుకున్నాడు.

శ్రీరామ్ పరాయిదేశంలో వుండి నెలకు వేలకు వేలు ఆర్జిస్తూంటే ఇష్టం వచ్చినట్లుగా ఖర్చుపెట్టడం అలవాటు పడిన పిల్లలకు బడ్జెట్ ప్రకారం నడుచుకోవాలంటే ఫ్రెండ్స్‌తో హొటల్స్‌కు, సినిమాలకు వెళితే బిల్లు వాళ్ళే ఇస్తూ వందలు, వందలు ఖర్చుపెట్టే సుష్మ, శ్రీనివాస్‌లకు కష్టంగా వుంది.

''మమ్మీ... నువ్వు ఈ మధ్య పాకెట్ మనీ మరీ తగ్గిస్తున్నావ్'' తల్లి దగ్గర గునుస్తూ అంది సుష్మ.

''సుష్మా...నువ్వు చిన్నపిల్లవుకావు. ఇంటి పరిస్థితులను అర్థం చేసుకో! ముందులాగ డాడీ వేలకు వేలు సంపాదించడంలేదు. జీతంలో సర్దుకోవాలి''... శాంతంగా నచ్చచెబుతోంది ఇందుమతి.

శ్రీనివాస్ కూడా అదే ఫిర్యాదు తల్లితో!

''మా ఫ్రెండ్స్‌తో హొటల్స్‌కు వెళ్ళాలంటే అవమానంగా వుంది మమ్మీ... డాడీ అక్కడ ఉద్యోగం ఎందుకు మానేశారు?'' విసుగ్గా అన్నాడు శ్రీనివాస్. ఇందుమతి పిల్లలిద్దరిని ఆశ్చర్యంగా చూస్తోంది. వీళ్లెందుకిలా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారు? అనుకుంది.

''మమ్మీ... డాడీ మళ్ళీ లిబియా వెళితే ఏం? ఇలా డబ్బుతో అవస్థపడేకంటే... ఈసారి వెళితే నాకోసం ఒక మారుతి కారు కొనాలని అనుకున్నాను...'' అన్న సుష్మ మాటలకు దెబ్బతిన్నట్లుగా చూస్తూ—

''మీరసలు... పిల్లలేనా?... డబ్బుకోసం కన్న తండ్రిని దూరం చేసుకునే మీరు పిల్లలా!... ఎందుకిలా తయారయ్యారు... వెళ్ళండి అవతలకు...'' హిస్టీరియా వచ్చినదానిలా అరిచింది.

ఆ అరుపులకు ''ఏమయింది?'' అంటూ వచ్చాడు శ్రీరామ్.

పిల్లలిద్దరూ మెల్లగా జారుకున్నారు.

వంట ఇంటిలోనే కూలబడిపోయి ఏడుస్తూ ''నా ఆనందాన్ని కొల్లగొట్టాలని చూస్తున్న రాక్షసులు వీళ్ళు. వీళ్ళకు డబ్బు తప్ప ప్రేమానురాగాలు తెలియవు. డబ్బుకోసం మీరు మళ్ళీ లిబియావెళ్ళాలిట. చూసారా?... వీళ్ళ భవిష్యత్తు కోసమా మనం ఇన్నేళ్ళు కష్టపడింది. పరి స్వార్థపరులు...'' అందిపిచ్చిదానిలా.

''ఇందూ...'' అంటూ దగ్గరకు తీసుకుని ''పిచ్చీ...ఏమిటది..మన పిల్లలను మనం నిందించుకోవడమా? వాళ్ళకు నేను మెల్లగా నచ్చచెబుతాను. ఇన్నేళ్ళూ నేను దూరంగా వుండి డబ్బుసంపాదించడంవల్ల వారికి నాతో అనుబంధం ఏర్పడలేదు. డబ్బుకోసమే డాడీ వున్నాడు అనేభావన వారిలో వుంది. మెల్లగా నేను సర్దుతాను. నువ్వు బాధపడకు...'' అంటూ ఓదార్చాడు.

అతడు చెబుతున్నది నిజమే అనిపించసాగింది ఇందుమతికి.

ఆ సంఘటన జరిగిన తరువాత శ్రీరామ్ పిల్లలిద్దరికీ ఎలా చెప్పాడో ఏం మంత్రం వేసాడో ముందులా పిల్లలు పాకెట్ మనీ అంటూ ఇందుమతిని విసిగించడంలేదు.

* * *

ఆ రోజు ఉదయం పదిగంటలపుడు వచ్చిన ఫోన్‌కాల్ ఇంటిల్లిపాదిని విచారంలో ముంచి వేసింది. కొత్తగా పెళ్ళయిన సుష్మ స్నేహితురాలు అనిత గాస్ సిలిండర్ పేలి చనిపోయింది. కానీ అది సహజమయిన చావుకాదని అందరి అనుమానం. అనిత వాళ్ళది మధ్యతరగతి కుటుంబం. పెళ్ళిలోనే మర్యాదలు సరిగ్గా లేవని గొడవలు వచ్చాయి. అవన్నీ మనసులో పెట్టుకుని భర్త, అత్తగారు కట్నం చాలలేదని చంపారని అనుమానం. పోలీస్‌కేస్ అయింది. తగిన సాక్ష్యాధారాలు లేక కేసు తేలిపోయింది.

ఆ రోజు ఫ్రెండ్స్ అంతా సుష్మ వాళ్ళ డ్రాయింగ్ రూమ్‌లో చేరారు. అందరి మనసులు విచారంగా వున్నాయి. తమ మధ్య ఆడుతూ, పాడుతూ తిరిగిన తమ నెచ్చెలి వరకట్నపు కోరలకు బలి అయిందంటే... అందరిలో ఆలోచనరేకెత్తింది. గట్టులేక పరుగులు తీసే పిల్లవాగులాంటి వారి వ్యక్తిత్వం ఈ సంఘటనతో మేల్కొన్నట్లయింది. అనురాగంతో ముడిపడాల్సిన దాంపత్యంలో కట్నం ప్రసక్తి ఎందుకు? కట్నం, ఇతర లాంఛనాలు అన్నీ ముట్టచెప్పినా భర్త, అత్తగారినుండి రక్షణ లేక అంతం అయ్యేస్త్రీలు ఎంతమంది? దానికి అంతంలేదా? తమ మూడో తరం... రేపటి తరం ప్రతినిధులమయిన తాము ఏమీ చెయ్యలేరా? భర్తచనిపోయాడని 'రూప్ కన్వార్'ను సజీవదహనం చేశారు. దానికి 'సతీసహగమనం' అనే పేరు ఒకటి. ఎంతసిగ్గుచేటు. కష్టంలో, సుఖంలో ఆదుకుంటానని ప్రమాణం అగ్నిసాక్షిగా చేసిన భర్తే క్రూరజంతువు కంటె హీనంగా భార్యను చంపేస్తే?... అలాంటిపెళ్ళి ఎందుకు చేసుకోవాలి? కట్నం యిచ్చి అలాంటి పశువును కొనుక్కోకపోతే ఏం?...

సుష్మలో కొత్త ఆలోచనలు మొదలవుతున్నాయి. మనసు తలుపులు అప్పుడే తెరుచుకుంటున్నట్లుగా వుంది.

డ్రాయింగ్ రూమ్‌లోకి అందరికోసం కాఫీ తెచ్చిన ఇందుమతి 'అందరూ అలావున్నారేమర్రా... ఇంకా అనితను తలచుకుని బాధపడుతున్నారా? ఏమిటో... ఆ అమ్మాయి పిరికిగా చనిపోయింది. చచ్చేముందు భర్తనో... అత్తనో చంపివుంటే మరీ బాగుండేది....'

అందరూ ఆమెకేసి ఆశ్చర్యంగా చూసారు. ''మమ్మీ...'' అంది సుష్మ.

''అవును సుష్మా... నేటి తరం స్త్రీకి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మా తరంలో కంటె ఎక్కువ అవుతున్నా రక్షణలేకుండా పోతోంది. మా తరంలో, మాముందు తరంలో ఇన్ని వరకట్నపు చావులులేవే?... ఇన్ని మానభంగాలు, ఇన్ని హత్యలు మాకు తెలియవు. మాకు తెలిసింది ఆప్యాయత, ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడం. మా తరంలో అత్తగారు కోడల్ని సాధించినా వారి మధ్య ఒక అనుబంధం వుండేది. కానీ నేడు? ఆప్యాయతలు కరువు అయిపోయి మనసులు వికృతమవుతున్నాయి. మానవులు దానవులవుతున్నారు. అందుకే ఇన్ని సమస్యలు. ఇప్పుడు అత్తగార్లూ అలాగే వున్నారు. కోడళ్ళూ అలాగే తయారవుతున్నారు. ఆడపిల్ల తల్లిదండ్రుల్ని నిలువు దోపిడీ చేసెయ్యాలనే దృక్పథం మారేంతవరకు ఈ వరకట్నపు చావులకు అంతం వుండదు. మీ తరం యువతీయువకులయినా ఈ చావులను అరికట్టగలిగితే మా తరం వాళ్ళు పెట్టుకున్న ఆశలు నెరవేరుతాయి...'' అని చెప్పి వచ్చేసింది.

అందరిలో ఆలోచన మొదలయింది.

* * *

ఊసులు అల్లుకుంటూ బాల్కనీలో కూర్చున్న ఇందుమతికి దూరంగా నవ్‌బత్‌పహాడ్ మీద లైట్లను చూస్తుంటే మనసు ప్రశాంతంగా అనిపించసాగింది. సుష్మ ఈ మధ్య చాలామారిపోయింది. చిలిపితనం పోయి ప్రతిదీ నిశితంగా ఆలోచించడం మొదలుపెట్టింది. శ్రీనివాస్‌లో కూడా బాగా మార్పు వచ్చింది. అనిత చావు అందరిలో మార్పు తెచ్చింది. ''నాన్నగారిలాగ కష్టపడి నా భర్తకూడా సంపాదించాలి కానీ... నేను ఆస్తిని తీసుకెళ్ళడం ఏమిటి?'' అని వాదిస్తుంది సుష్మ.

ఇంచుమించు శ్రీనివాస్‌లో కూడా అలాంటి భావమే! తండ్రితో కలిసి వుంటే ఇల్లు ఎంత కళ కళలాడుతూ వుంటుందో వాడికి బాగా అర్థం అయింది. అందుకే ఇందుమతికి నిశ్చితంగా వుంది.

శ్రీరామ్ తన దగ్గరే ఉన్నాడు. ఇన్నేళ్ళూ దూరంగా ఉండి డబ్బు మాత్రం సంపాదించగలిగారు. కానీ ఏం సాధించినట్లు?... చిన్నప్పటి సుఖశాంతులతో పోలిస్తే ఇపుడు మనుషులు మరబొమ్మలుగా మారి శాంతిని కోల్పోతున్నారనిపిస్తుంది. చల్లని సాయంత్రాలు, ప్రశాంతంగా ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ బ్రతకలేని ఈ బ్రతుకులెందుకు? ఈ పరుగులెందుకు?

''మంచువంటి... మల్లెవంటి మంచి మనసుతో జీవించలేని పనికిరాని చదువులెందుకు?...'' చిన్నప్పటి సుశీలపాట మెదులుతుంది మనసులో!

''దేవిగారు ఊహాలోకంలో విహరిస్తున్నారే?'' వాకింగ్‌కి వెళ్ళివచ్చిన శ్రీరామ్ పలకరింపుతో ఉలిక్కిపడి సిగ్గుపడుతూ—

''ఇప్పుడు ఊహలేమిటండీ... మన వయసు ఎంతనుకున్నారు. సుష్మకు పెళ్ళిచేస్తే తాతయ్య అవుతారు.''

హాయిగా నవ్వాడు. ''అయినా నా కంటికి నువ్వు ఎప్పుడూ తొలిరోజుల్లో ఇందూలాగే కనిపిస్తావు. ఈ పదేళ్ళు ఇంతమంచి గృహ వాతావరణం వదిలిపెట్టి ఎలా వుండగలిగానా అనిపిస్తోంది'' అన్నాడు.

''అదంతా పీడకలలా అనిపిస్తుందండీ... ఆ వంటరితనం... ఆ బాధ గుర్తుచేయకండి'' భయంగా అంది.

''మనమేకాదు ఇందూ... మనదేశంలో మనలాంటి భార్యాభర్తలు ఎంతమందో! డబ్బులేక మన సమాజంలో బ్రతకలేక కేవలం డబ్బుకోసం, దేశాన్ని, భార్యా బిడ్డలను వదలి వెళ్ళడం మామూలై పోయింది... అయినా మనదేశం, మన సంస్కృతి గొప్పదనం మనదే ఇందూ. విదేశాలలో కూడా మన వివాహం, మన వ్యవస్థ ఆచారాలు అంటే ఎంతో గౌరవం తెలుసా? ఇండియన్ లేడీ అనగానే అక్కడివాళ్ళకు ఒక దేవతతో సమానం. ఎంత ఓర్పు, సహనం, జీవితాంతం భార్యాభర్తలు ఎలా కలిసి వుంటారు? అని అమెరికన్లు ఆశ్చర్యపోతారు. మన వివాహ వ్యవస్థలోని తియ్యదనం చాలామందికి అర్థంకాదు...'' అన్నాడు.

చిన్నగా నిట్టూరుస్తూ 'భారతస్త్రీకి సహనం, ఓర్పు అనే బిరుదులతోనే అనాదిగా సంకెళ్ళు వేస్తున్నారు. అయినా శ్రీరామ్ చెప్పినట్లు ఈ వివాహ వ్యవస్థలో ఏదో ఆకర్షణ, పవిత్రత వుంది. అందుకే ఎన్ని కష్టాలు వచ్చినా ఈ బంధాన్ని నిలుపుకోవాలని చూస్తుంది స్త్రీ...' అనుకుంది ఇందుమతి. ■